సాక్షి మెదక్

మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024



పక్కాగా నిఘా

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు కొనసాగేలా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహిస్తోంది.

వివరాలు 8లో ►



బీజేపీపై పగ లేదు

బీజేపీపై ఎలాంటి పాలి పగ లేదని, పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైనే ప్రశ్నిస్తున్నామని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.

వివరాలు 8లో ►



మహిళా ఓటర్లే ఎక్కువ

నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

వివరాలు 9లో ►

జనసభకు సర్వం సిద్ధం

నేడు అల్లాదుర్గం రానున్న ప్రధాని మోదీ



సభాప్రాంగణంలో మోదీ భారీ కటౌట్



ముస్తాబవుతున్న వేదిక

మెదక్‌జోన్/అల్లాదుర్గం(మెదక్): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం అల్లాదుర్గంలో నిర్వహించనున్న జనసభలో పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే బహిరంగ సభకు పార్టీ నేతలు, నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల మధ్యలో నిర్వహించే సభకు 1.50 లక్షల జన సమీకరణ చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. రెండు రోజులుగా పార్టీ ముఖ్య నేతలు, నాయకులు జనసమీకరణలో నిమగ్నం కాగా ఆయా మండల స్థాయి నాయకులకు జనాన్ని తరలించే బాధ్యతలను అప్పగించారు. సభాస్థలిని సోమవారం సాయంత్రం అదనపు కలెక్టర్ రమేశ్ పరిశీలించారు. కాగా రెండు నెలల వ్యవధిలో ఉమ్మడి మెదక్ జిల్లాకు మోదీ రావడం ఇది రెండో సారి.

నిధులు కోరనున్న నేతలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు వస్తున్న ప్రధాని మోదీని పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని ఆపార్టీ నేతలు కోరనున్నట్లు తెలిసింది. ఇందులో మెదక్ నుంచి పటాన్‌చెరు రైల్వేలైన్, మెదక్– మీర్జాపల్లి రైల్వేలైన్, మెదక్ వయా పాపన్నపేట, వట్‌పల్లి మీదుగా బీదర్ వరకు జాతీయ రహదారి, మెదక్– చేగుంట ప్రధాన రహదారి, చేగుంటలో రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరనున్నట్లు సమాచారం.

800 మందితో బందోబస్తు

ప్రధాని మోదీ బహిరంగ సభకు మెదక్ జిల్లాతో పాటు సిరిసిల్ల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల నుంచి సుమారు 800 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. వీరు కాకుండా సెంట్రల్ ఫోర్స్, ఇంటెలిజెన్స్ విభాగం పర్యవేక్షణలో సభ జరగనున్నట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

మెదక్ పోరులో 44 మంది

- 9 మంది విత్‌డ్రా
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ



మెదక్ కలెక్టరేట్: మెదక్ లోక్‌సభ బరిలో 44 మంది అభ్యర్థులు నిలిచారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సోమవారం జరిగిన విత్‌డ్రా కార్యక్రమంలో 9 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. అయితే వీరంతా సిద్దిపేట జిల్లా వారే కావడం గమనార్హం.

10 జిల్లాలు.. 53 మంది

మెదక్ పార్లమెంట్ స్థానానికి రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 53 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 44 మంది, ఇతర జిల్లాల నుంచి 9 మంది నామినేషన్లు వేశారు. సిద్దిపేట జిల్లా నుంచి 19 మంది, సంగారెడ్డి 15, మెదక్ 10, హైదరాబాద్ 2, అదిలాబాద్ 1, మేడ్చల్ 2, ఖమ్మం 1, హన్మకొండ 1, వరంగల్ 1, రంగారెడ్డి జిల్లా నుంచి 1 చొప్పున నామినేషన్లు దాఖలు అయ్యాయి. అయితే ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు సిద్దిపేట జిల్లావాసులు కాగా కాంగ్రెస్ అభ్యర్థి సంగారెడ్డి జిల్లాకు చెందిన వారు.

ఒకే ఒక్క మహిళా అభ్యర్థి

మెదక్ పార్లమెంట్ ప్రస్థానం ప్రారంభమై 72 ఏళ్లు కాగా అప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం ముగ్గురు మహిళలే ఎంపికయ్యారు. వారిలో సంగం లక్ష్మీబాయి(1967), దివంగత ప్రధాని ఇందిరాగాంధీ (1980), విజయశాంతి (2009) ఎంపీలుగా గెలుపొంది పార్లమెంట్‌లో జిల్లా వాణి వినిపించారు. తాజాగా 53 మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో కేవలం ఒకే ఒక్క మహిళా అభ్యర్థి ఉన్నారు. హన్మకొండ జిల్లాకు చెందిన అచ నాగమణి మెదక్ ఎంపీ బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీలు మహిళ అభ్యర్థులను బరిలో దించలేదు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడు జిల్లాలు ఉండగా మొత్తం 18,28210 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 9,25891 మంది మహిళా ఓటర్లు కాగా కేవలం ఒకే ఒక్క మహిళా అభ్యర్థి పోటీలో ఉండడం చర్చనీయాంశంగా మారింది.

జహీరాబాద్‌లో 19 మంది

సంగారెడ్డి టౌన్: జహీరాబాద్ లోక్‌సభ బరిలో మొత్తం 40 మంది అభ్యర్థులు, 64 సెట్లు నామినేషన్ దాఖలు చేయగా 14 మంది నామినేషన్లు రిజెక్ట్ అయ్యాయి. ఇందులో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మిగితా 19 మంది బరిలో ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి బీబీ పాటిల్, కాంగ్రెస్ నుంచి సురేష్ షెట్కార్ బరిలో నిలిచారు.

బీఆర్ఎస్ హయాంలోనే ప్రగతి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



అచ్చంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్‌రూరల్: బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మండలంలోని తుజాల్‌పూర్, బ్రాహ్మణపల్లి, గొల్లపల్లి, లింగాపూర్, నారాయణపూర్‌తో పాటు పలు గిరిజన తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమిలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. చేతకాని హామీలు ఎన్నో ఇచ్చి కరెంట్ కష్టాలు తెచ్చిపెట్టిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నర్సింగరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమ్, మాజీ సర్పంచ్ గాలి శ్రీరాములు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ బాబ్యానాయక్, జీవన్‌రెడ్డి, షేక్ హుస్సేన్, ప్రసాద్, సేనాధిపతి, వెంకట్, విఠల్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్‌గౌడ్, కరుణాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీల వ్యతిరేకి

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నర్సాపూర్‌రూరల్: ఓబీసీల వ్యతిరేకి కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఓబీసీ సామాజిక సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ సమాజంలో ఉన్న అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. తొలి నుంచి కాంగ్రెస్ ఓబీసీలకు వ్యతిరేకమని ఆరోపించారు. రాజీవ్ గాంధీ మండల్ కమిషన్ నివేదికను అమలు చేయలేదని.. ఓబీసీ వర్గాన్ని రాహుల్‌గాంధీ దొంగలుగా అభివర్ణించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించిందన్నారు. ఓబీసీ క్రిమిలేయర్ రూ.6 లక్షల నుంచి రూ. 8 లక్షలకు పెంచిందన్నారు. విశ్వకర్మ యోజన ద్వారా రూ.13 కోట్ల మందికి లబ్ధి చేకూరుస్తుందన్నారు. ఓబీసీల అభివృద్ధి కోసం పనిచేస్తున్న బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కొల్చారం, నర్సాపూర్ మండలాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్, ఓబీసీ అధికార ప్రతినిధి విఠల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు వెంకటేష్ కాశీనాథ్, విజయ్, వాల్దాస్ మల్లేష్ గౌడ్, దయాకర్‌గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

రుణమాఫీపై ఆందోళన వద్దు

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

రామాయంపేట(మెదక్): రుణమాఫీ విషయమై రైతులు ఆందోళన చెందవద్దని, ఆగస్టు 15లోగా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. సోమవారం రామాయంపేటలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాను గెలిచిన మూడు నెలల కాలంలోనే గ్రామాలు, తండాల్లో సీసీ రోడ్లు వేయించానని తెలిపారు. మెదక్‌లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సంబంధించి కమిటీని వేయించినట్లు చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అభివృద్ధి గురించి ఎంతమాత్రం పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ వారు కొంత మందికి మద్యం తాగించి, డబ్బులిచ్చి గొడవ చేయిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారన్నారు. అంతకుముందు ఇతర పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాతరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

సాయం కోసం వెళ్లి జల సమాధి



పెంటయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): చెరువులో ఉన్న మిత్రుడి గేదెలను తీసుకొచ్చేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఈసంఘటన మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్దాగౌడ్ గేదెలు మేతకు వెళ్లి ఎండగా ఉండడంతో చెరువులో దిగాయి. సాయంత్రం అయినా బయటకు రాకపోవడంతో అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు గొల్ల పెంటయ్య (56) సాయం కోరాడు. ఈ క్రమంలో గేదెల కోసం చెరువులో దిగిన పెంటయ్య ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఒడ్డున ఉన్న సిద్దాగౌడ్ గ్రామస్తులకు చెప్పడంతో చెరువులో గాలించగా పెంటయ్య మృతదేహం లభించింది.

ముహూర్తాల్లేవ్!

3 నెలల పాటు శుభకార్యాలకు బ్రేక్



మెదక్ కలెక్టరేట్: మరో మూడు నెలల వరకు ముహూర్తాల్లేవు. ప్రతీ ఏడాది పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఎక్కువగా మార్చి, మే నెలల్లోనే జరుగుతుంటాయి. పాఠశాలలకు సెలవులు ఉండడంతో తల్లిదండ్రులు పిల్లలతో ఉత్సాహంగా శుభకార్యాలకు వెళ్తుంటారు. కానీ ఈ ఏడాది మూఢం రావడంతో వేసవి సెలవుల్లో పెళ్లిళ్లు, ఎలాంటి శుభకార్యాలు లేకుండా పోయాయి. నేటి నుంచి ఏకంగా మూడు నెలలపాటు బ్రేక్ పడనుంది.

సుమారు 20 వేల పెళ్లిళ్లు

ఈసారి శుభకార్యాలు చైత్రమాసంలో మొదలయ్యాయి. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు బాగానే జరిగాయి. అత్యవసరం అనుకునే వారు కొన్ని అనుకూలతలను దృష్టిలో పెట్టుకొని ముహూర్తాలకు వెసులుబాటు తీసుకున్నారు. ఈ నాలుగు నెలల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల పెళ్లిళ్లు జరిగాయని పురోహితులు అంచనా వేస్తున్నారు. ఆ రోజుల్లో బ్రాహ్మణులు, ఇతర కుల వృత్తుల వారు, బంగారు వ్యాపారులు, ఫంక్షన్ హాళ్ల యజమానులు, ట్యాక్సీలు, వస్త్ర వ్యాపారులు, ఇలా పలువర్గాల వారికి చేతి నిండా పని దొరికింది. ఈ మూడు నెలలు వ్యాపారాలు డీలా పడనున్నాయి.

తగ్గనున్న ఉపాధి

నేటి నుంచి మూఢం ఆగస్టు 15 వరకు కొనసాగనుంది. ఈ రోజుల్లో వివాహాలు, పెళ్లి చూపులు, గృహ ప్రవేశాల జోలికి వెళ్లరు. మళ్లీ ఆగస్టు 15వ తేదీ తర్వాతే శుభకార్యాలు జరుగనున్నాయి. అప్పటి వరకు వీటిపై ఆధారపడిన ఫంక్షన్ హాళ్లకు, బ్యాండు కళాకారులు, డెకరేషన్, టెంట్ హౌస్ నిర్వాహకులు, పూల వ్యాపారులు ఉపాధికి కొంత నష్టం కలగనుంది. అయితే పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో కొంతమేర ఉపశమనం అనుకోవచ్చు.

మూడు నెలలు ఆగాల్సిందే

ఏదైనా పని చేయాలంటే దానికి ముహూర్త బలం చాలా ముఖ్యం. శుభకార్యం మొదలు పెట్టే సమయంలో ముహూర్తం చూసుకోవడం సంప్రదాయం. మంచి ముహూర్తంలో మొదలు పెట్టిన ఏ శుభకార్యమైనా మంచి ఫలితం ఇస్తుంది. నేటి నుంచి మూఢం వస్తున్నందున ప్రజలు శుభకార్యాలను వాయిదా వేసుకోవాలి. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు మంచి ముహూర్తంలోనే నిర్వహించుకోవాలి.

– శాస్త్రుల పవన్‌శాస్త్రి, పురోహితుడు

ప్రజల చేతిలో చిప్ప పెట్టారు

- బీఆర్ఎస్ పాలనపై మంత్రి కొండా సురేఖ మండిపాటు



కొండపాకలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

గజ్వేల్/కొండపాక(గజ్వేల్): తొమ్మిదిన్నరేళ్ల అధికారం అప్పగిస్తే కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబీకులు తెలంగాణ ప్రజల చేతిలో చిప్పపెట్టారని మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. సోమవారం గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక, కుకునూర్‌పల్లి, గజ్వేల్ మండలాల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ కేసీఆర్, కవిత, కేటీఆర్, హరీశ్‌రావులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఎలా ఉండాలో వైఎస్ఆర్‌ను చూస్తే అర్థమవుతుందన్నారు. ఎలా ఉండకూడదో అలాగే కేసీఆర్‌ను చూస్తే అర్థమవుతుందని అభిప్రాయపడ్డారు. వైఎస్ పాలన, కేసీఆర్ పాలనకు తేడా స్పష్టంగా తెలుసునని, అందుకే ఈ మాటను చెబుతున్నానని పేర్కొన్నారు. కేటీఆర్ పెద్ద అహంకారని, తెలంగాణకు తానే రాజుననే తరహాలో వ్యవహరించాడన్నారు. కేసీఆర్ ఇంట్లో ఉంటే కేటీఆర్ రాజ్యమేలాడని విమర్శించారు. కాళేశ్వరం గురించి అడిగితే తనకు ఆశాఖతో సంబంధం లేదని చెప్పిన ఆయన, ఇతర అభివృద్ధి గురించి మాత్రం తానే చేసినట్లు తన ఖాతాలో వేసుకునేవాడన్నారు. ప్రభుత్వం ఆగస్టు 15 లోపు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ మాటకు కట్టుబడి ఉందని, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా మాటకు కట్టుబడి ఉండాలని, లేనిపక్షంలో గ్రామాల్లోకి రాకుండా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎక్కడికక్కడ ఘెరావ్ చేయాలని మంత్రి పిలుపు ఇచ్చారు. కేసీఆర్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధి నామమాత్రమేనని చెప్పారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి తమ పార్టీ అభ్యర్థి నీలం మధును కాంగ్రెస్ బరిలో నిలిపిందని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు భూంరెడ్డి, ఎల్లక్షన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు మడుపు భూంరెడ్డి, అంక్షారెడ్డి, చిట్టి మాధురీరెడ్డి, అనంతుల నరేందర్, విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి, లింగారావు, పొల్కంపలి నరేందర్, కాచం నవీన్‌కుమార్, రవిందర్, సురేందర్‌రావు, బోడపట్ల శివ, కిష్టారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఓటర్లకు కనీస వసతులు కల్పించాలి: సమీర్ మాధవ్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్

హవేళీఘణాపూర్(మెదక్): ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కనీస వసతులు కల్పించాలని ఎన్నికల అబ్జర్వర్ సమీర్ మాధవ్ కుర్కోటి సిబ్బందికి సూచించారు. సోమవారం జిల్లా సరిహద్దు పోచమ్మరాళ్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలించారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాలలో ఓటరు స్లిప్పుల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, బీఎల్ఓ సూపర్‌వైజర్ మహేశ్‌చంద్ర, ప్రణయ్‌కుమార్, బీఎల్ఓలు ఉన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

చేగుంట(తూప్రాన్): మండలంలోని బోనాల గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్వాన్షి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా చెక్‌పోస్టులో ప్రతిరోజు ఎన్ని వాహనాలు పరిశీలిస్తున్నారని పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టు నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయండి



నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబం

మెదక్ కలెక్టరేట్: పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలంటూ జీడిమెట్లలోని షాపూర్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్‌రావు సోమవారం కలెక్టరేట్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి నిరసనకు దిగాడు. తన తండ్రి వెంకటేశ్వర్‌రావు 2001లో తూప్రాన్ మండలం దత్తార్‌పల్లి శివారులో 4 ఎకరాల 34 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చినట్లు తెలిపారు. 2018లో ధరణి వచ్చాక కొత్త పట్టాదార్ పాస్‌బుక్ ఇవ్వడం లేదన్నాడు. ఐదేళ్లుగా అధికారులు నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో ఓ సమావేశానికి హాజరైన తూప్రాన్ డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్ విషయం తెలుసుకొని వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని తెలిపారు.

బోనం.. వైభవం



పాపన్నపేట(మెదక్): మండలంలోని పలు తండాల్లో సోమవారం బోనాలు వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పద్మ గిరిజన మహిళలతో కలిసి బోనమెత్తారు. గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలతో ఆకట్టుకున్నారు. సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశం, రవీందర్, అనిల్‌రెడ్డి, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మే 2లోగా ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి

మెదక్ కలెక్టరేట్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజును మే 2వ తేదీలోగా చెల్లించాలని ఇంటర్ జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన వారు మే 2వ తేదీలోగా సమీపంలోని మీసేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

మే 2న జాబ్‌ మేళా

సిద్దిపేటఎడ్యుకేషన్‌ : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్‌ కళాశాలలో మే 2న జాబ్‌ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సీహెచ్‌ ప్రసాద్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల తెలంగాణ స్కిల్స్‌ నాలెడ్జ్‌ సెంటర్‌ (టీఎస్‌కేసీ), కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాలో హెటిరో ల్యాబొరేటరీస్‌ ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. 2020 సంవత్సరం నుంచి 2024 వరకు కెమిస్ట్రీతో డిగ్రీ, లేదా ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు అర్హులని కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్‌ వాసం శ్రీనివాస్‌, టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్‌ ఇమ్మడి శ్రీనివాసరావు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు తమ సర్టిఫికేట్స్‌, ఆధార్‌ కార్డు జిరాక్స్‌లతో కళాశాల ఓల్డ్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌లో ఉదయం 10 గంటల లోగా హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 83099 65743 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్‌ కల్పించాలి

- బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌


మాట్లాడుతున్న మహేందర్‌

మెదక్‌జోన్‌ : బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్‌ కల్పించాలని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం మెదక్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ వైఖరి ఏంటో ప్రధాని స్పష్టం చేయాలని, జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కనీసం 50 శాతం రిజర్వేషన్లను అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణలో బీసీ సబ్‌ ప్లాన్‌ ఏర్పాటు చేసి ప్రత్యేక బడ్జెట్‌ కేటాయించాలని కోరారు. మెదక్‌ పార్లమెంట్‌ కాంగ్రెస్‌ అభ్యర్థిగా బరిలో ఉన్న బీసీ బిడ్డ నీలం మధును ఎంపీగా గెలిస్తే పార్లమెంట్‌లో బీసీల గొంతుక అవుతాడన్నారు. సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్‌ ఎ.దశరథం, రాష్ట్ర కార్యదర్శి మేడావరపు రాజేశ్‌ కమార్‌, జంగిటి నిఖిల్‌, శ్రీకాంత్‌ ముదిరాజ్‌, తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష నాయకులను గెలిపించండి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య


ప్రచారం చేస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రజలకు మేలు జరగాలంటే వామపక్ష నాయకులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య అన్నారు. సోమవారం మండలంలోని అయినాపూర్‌ గ్రామంలో భువనగిరి పార్లమెంట్‌ అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా మండల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో తాడూరి రవీందర్‌,తేలు ఇస్తారి, అత్తిని శారద తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా నిఘా

జిల్లాలోని చెక్‌ పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు కొనసాగేలా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహిస్తోంది. పార్లమెంట్‌ ఎన్నికలు సజావుగా సాగేలా పోలీసు శాఖ ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేస్తుంది. ఓటర్లను ప్రలోభ పెట్టకుండా జిల్లాలో అక్రమ నగదు, మద్యం సరఫరా జరగకుండా జిల్లాలో ప్రత్యేకంగా 12 చెక్‌ పోస్టులను ఏర్పాటు చేసి కేంద్ర బలగాలతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి తీసుకెళ్తే పోలీసులు నగదును సీజ్‌ చేసి జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలోని గ్రీవెన్స్‌ సెల్‌కి అందజేస్తున్నారు.

– సిద్దిపేటకమాన్‌

- రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే స్వాధీనం
- సరైన ఆధారాలు ఉంటే తిరిగి అందజేత
- ఇప్పటి వరకు రూ.కోటి 26 లక్షలు సీజ్‌
- 2,049 లీటర్ల మద్యం, 8,209 కేజీల గంజాయి స్వాధీనం


చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌ (ఫైల్‌)

జిల్లాలో 12 చెక్‌ పోస్టులను ఏర్పాటు చేసి ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించారు. చెక్‌ పోస్టుల వద్ద 24 గంటలు వాహనాల తనిఖీ నిర్వహిస్తూ అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు ఉంటే సీజ్‌ చేస్తున్నారు. అదే విధంగా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే సీజ్‌ చేస్తున్నారు. వంటిమామిడి, జగదేవ్‌పూర్‌, బేగంపేట, భూంపల్లి, అనంతసాగర్‌, జక్కాపూర్‌, అక్కనపేట, ముస్త్యాల వద్ద చెక్‌పోస్టులు, బస్వాపూర్‌, నాగులబండ, శిలాజీనగర్‌, ఐనాపూర్‌ వద్ద స్టాటికల్‌ సర్వేలెన్స్‌ టీమ్స్‌ చెక్‌ పోస్టులను ఏర్పాటు చేసి ప్రతీ వాహనంపై నిఘా పెట్టారు.

రూ.1,26,07,450 నగదు సీజ్‌

వాహనాల తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.1,26,07,450 నగదు సీజ్‌ చేశారు. అదే విధంగా రూ.9,93,765 విలువ గల 2,049 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 186 ఎక్సైజ్‌ కేసులు నమోదు చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న 28 లైసెన్స్‌డ్‌ తుపాకులను సంబంధిత పోలీసు స్టేషన్‌లలో డిపాజిట్‌ చేశారు. 196 నాన్‌ బెయిలబుల్‌ వారెంట్స్‌ ఎగ్జిక్యూట్‌ చేసి 131 కేసులు నమోదు చేశారు. 136 మందిని బైండోవర్‌ చేశారు. రూ. 2,65,420 విలువ గల 8,209 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రూ. 26,55,006 విలువ గల 388 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని మూడు మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ కేసులు నమోదు చేశారు.

క్రిటికల్‌ పోలింగ్‌ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో 1,010 పోలింగ్‌ స్టేషన్‌లు ఉండగా వీటిలో 888 సాధారణమైనవి కాగా, 122 క్రిటికల్‌ పోలింగ్‌ స్టేషన్లుగా అధికారులు గుర్తించారు. ఈ సమస్యాత్మక పోలింగ్‌ స్టేషన్‌లపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. 11 ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ టీమ్స్‌, 26 మోడల్‌ కండక్ట్‌ కోడ్‌ టీమ్స్‌, స్టాటికల్‌ సర్వే లైన్స్‌ టీమ్స్‌ , సీఐఎస్‌ఎఫ్‌ కంపెనీకి చెందిన 80 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర బలగాలు మరికొంత మంది సిబ్బంది త్వరలో జిల్లాకు రానున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు.

విస్తృతంగా తనిఖీలు..



జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు, ఫ్రీ అండ్‌ ఫెయిర్‌ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగంతో కలిసి పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తాం. జిల్లాలో ప్రత్యేక చెక్‌ పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా పోలీసు సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నాం. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఏదైనా విషయంపై ఫిర్యాదు చేయాలనుకుంటే 1950కు కాల్‌ చేసి ఫిర్యాదు చేయాలి.

– అనురాధ, సిద్దిపేట సీపీ

బీజేపీపై ఎలాంటి పగ లేదు

- అక్రమ నిధులను తరలింపు కోసమే ఎలక్ట్రోరల్‌ బాండ్లు
- ప్రొఫెసర్‌ కోదండరాం


మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ కోదండరాం

హుస్నాబాద్‌: బీజేపీపై మాకు ఎలాంటి పాలి పగ లేదని, పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపైనే ప్రశ్నిస్తున్నామని ప్రొఫెసర్‌ కోదండరాం అన్నారు. పట్టణంలోని బీఎల్‌ఆర్‌ ఏసీ ఫంక్షన్‌ హాల్‌లో హుస్నాబాద్‌ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వక్తలు ప్రొఫెసర్‌ యోగేంద్ర యాదవ్‌, ప్రొఫెసర్‌ కోదండరాం, కన్నెగంటి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌ కోదండరాం మాట్లాడుతూ.. ఎలక్ట్రోరల్‌ బాండ్లు అక్రమ నిధులు తరలింపునకే ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎలక్ట్రోరల్‌ బాండ్ల ద్వారా 1300 సంస్థల నుంచి రూ.12,769 కోట్లు వివిధ పార్టీలకు విరాళాల రూపంలో వచ్చాయన్నారు. ఇందులో బీజేపీకి 54 శాతం, 10.3 శాతం చొప్పున తృణముల్‌ కాంగ్రెస్‌, కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలకు విరాళాలు వచ్చాయన్నారు. అడిగేవారు ఉండకూడదని బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తామని చెబుతున్నారని తెలిపారు. న్యాయం కోసం, పిల్లల భవిష్యత్‌ కోసం కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు.

బీజేపీ వద్ద అభివృద్ధి లెక్క లేదు

పదేళ్ల కాలంలో సాధించిన ప్రగతి లెక్క ఎంతో చెప్పడానికి బీజేపీ సిద్ధంగా లేదని ప్రొఫెసర్‌ యోగేంద్ర యాదవ్‌ అన్నారు. ఏడాదికి రూ. 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. సమావేశంలో జేఏసీ చైర్మన్‌ కవ్వ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్లు వీరన్నయాదవ్‌, డ్యాగల సారయ్య, ప్రొఫెసర్‌ వీరన్న నాయక్‌, ప్రజా సంఘాల నాయకులు కేడం లింగమూర్తి, కొయ్యడ కొమురయ్య, చిత్తారి రవీందర్‌, గడిపె మల్లేశ్‌ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

ఎమ్మెల్యే మాణిక్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ పార్టీకి ఓటు వేయాలని జహీరాబాద్‌ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఓటర్లను కోరారు. జహీరాబాద్‌ పార్లమెంట్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం మండల పరిధిలోని రాఘవాపూర్‌, ఇబ్రహీంపూర్‌, చినిగెపల్లి, అత్నూర్‌, డప్పూర్‌, మల్గి, రత్నాపూర్‌, మెరియంపూర్‌ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్‌, శ్రీపతి, భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బురిడీ కొట్టించి.. లక్షల్లో కాజేసి..

- ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌ పేరిట సైబర్‌ మోసం..
- రూ.10.73 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్‌: నకిలీ ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌ పేరిట సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి బురిడీ కొట్టించి భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌ పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి ఏప్రిల్‌ 1వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్‌ ఇన్‌స్టాగామ్‌లో వచ్చింది. లింకును ఓపెన్‌ చేసి వివరాలను నమోదు చేశారు. అపరిచిత ట్రేడింగ్‌ నిర్వాహకులు ఐడీని క్రియేట్‌ చేసి ఇచ్చారు. అతడు నగదు ఆన్‌లైన్‌ లో ఇన్వెస్ట్‌ చేస్తూ వచ్చాడు. మొత్తం రూ.10 లక్షల 73 వేలు పెట్టుబడి పెట్టాడు. తాను పెట్టిన నగదుతోపాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లుగా గుర్తించి ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు, అనంతరం సోమవారం అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆన్‌లైన్‌ ఫర్నిచర్‌ కొనేందుకు వెళ్లి..

మరో ఘటనలో అమీన్‌పూర్‌ మండల పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి ఫేస్‌బుక్‌లో ఏప్రిల్‌ 9వ తేదీన ఫర్నిచర్‌ సేలింగ్‌కి ఉందంటూ మెసేజ్‌ వచ్చింది. ఉద్యోగి నమ్మి అపరిచిత వ్యక్తికి ఫోన్‌ చేసి ఫర్నిచర్‌ కావాలని చెప్పాడు. ముందుగా నగదు పంపండి, కొరియర్‌ అతడితో మాట్లాడించి మీ అడ్రస్‌కు పంపుతానని నమ్మించాడు. బాధితుడు వెంటనే రూ.2 లక్షల 31 వేలు చెల్లించాడు. తీరా ఫర్నిచర్‌ కోసం అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం సోమవారం అమీన్‌పూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సొంత భూమి ఆక్రమించుకున్నారు

- ప్రాణహాని ఉంది కాపాడండి
- ప్రజావాణిలో ఓ బాధితురాలు ఫిర్యాదు

మెదక్‌ మున్సిపాలిటీ: నా భూమి ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నారు.. న్యాయం చేయాలంటూ ఓ బాధితురాలు జిల్లా ఎస్పీ బాలస్వామికి ఫిర్యాదు చేశారు. సోమవారం మెదక్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నర్సాపూర్‌ పట్టణం చైతన్యపురి కాలనీకి చెందిన గోడేల రాణి ఫిర్యాదు చూస్తూ.. తనకు వారసత్వంగా వెల్దుర్తి గ్రామంలో రెండెకరాల 20 గుంటలు వచ్చినట్లు తెలిపారు. మా మామ చనిపోయిన తర్వాత ఏడాదిపాటు ఆ భూమి వద్దకు పోలేకపోయామని, ఈ క్రమంలో కొంతమంది అక్రమంగా భూమిని ఆక్రమించి తనని రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ చట్ట ప్రకారం ఫిర్యాదుకి తగిన న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే కొల్చారం మండలం, గ్రామానికి చెందిన నేరెళ్ల విజయలక్ష్మి తన వ్యవయ పొలంలోని మామిడి చెట్టుకు గల కాయలను గుర్తు తెలియని వ్యక్తులు కోసుకు వెళ్తున్నారని, ఈ విషయంలో న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

వడదెబ్బకు ప్రభుత్వ సాయం

- పోస్టుమార్టం తప్పనిసరి
- వైద్యాధికారి నివేదిక కీలకం
- త్రిసభ్య కమిటీదే నిర్ణయం



టేక్మాల్‌(మెదక్‌): వేసవిలో ఎక్కువగా ప్రజలు వడదెబ్బకు గురవుతుంటారు. అనేక మంది వడదెబ్బ అని గుర్తించలేక ప్రాణాలు కోల్పోతుంటారు. ఇలాంటి వారికి ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందుతుంది. వడదెబ్బకు సంబంధించి ప్రతీ మండలానికి ఒక త్రిసభ్య కమిటీ ఉంటుంది. ఈ కమిటీ వడదెబ్బకు గురై చనిపోయిన వారి వివరాలను సేకరించి నివేదికను కలెక్టర్‌కు పంపించాల్సి ఉంటుంది. కలెక్టర్‌ పరిశీలించిన తర్వాత రూ.50 వేల పరిహారం మంజూరు చేస్తారు.

మండలానికొక త్రిసభ్య కమిటీ..

వడదెబ్బ మృతుల నిర్ధారణకు మండలానికి ఒక త్రిసభ్య కమిటీ ఉంటుంది. ఇందులో తహసీల్దార్‌, సబ్‌ఇన్‌స్పెక్టర్‌, వైద్యాధికారి సభ్యులుగా ఉంటారు. వడదెబ్బతో ఎవరైనా మరణిస్తే కమిటీ సభ్యులకు సమాచారం అందించాలి. ఆ వ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు ముందుగా వైద్యాధికారి ధ్రువీకరించాలి. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి సమీపంలోని ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించాలి. పోస్టుమార్టం నివేదికను వైద్యాధికారి పోలీస్‌స్టేషన్‌కు అందజేస్తే ఎఫ్‌ఐఆర్‌ ఆధారంగా వడదెబ్బ మృతిగా నిర్ధారిస్తారు. ఈ నివేదికను తహసీల్దార్‌ ద్వారా ఆర్డీఓకు అక్కడి నుంచి కలెక్టర్‌ పరిశీలించిన తర్వాత పరిహారాన్ని బాధిత కుటుంబానికి విడుదల చేస్తారు. వీటిపై ప్రజలు అవగాహన కల్గి ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వైద్యులకు సమాచారం ఇవ్వాలి



వడదెబ్బ తగులుతున్న వారిలో గ్రామీణ ప్రాంత కూలీ పనులకు వెళ్లేవారు, రైతులే అధిక శాతం ఉంటారు. పనుల్లో గాని, పనులకు వెళ్లి వచ్చాక గాని మరణిస్తే వైద్యసిబ్బందికి వెంటనే సమాచారం అందించాలి. వైద్యుల నివేదిక తప్పనిసరిగా తీసుకోవాలి.

– డాక్టర్‌ కృతిక, వైద్యాధికారిణి

పోస్టుమార్టం చేయించాలి



వేసవిలో వేడి గాలుల వల్ల మరణాలు సంభవించే అవకాశం ఉంది. మృతుడికి తప్పనిసరిగా పోస్టుమార్టం నిర్వహించాలి. కేసు లేకుండా, పోస్టుమార్టం లేకుండా ప్రభుత్వం ద్వారా ఎలాంటి పథకాలు వర్తించవు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– మురళీ, ఎస్‌ఐ

కలెక్టర్‌కు నివేదిక పంపుతాం



వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే త్రిసభ్య కమిటీకి సమాచారం ఇవ్వాలి. డాక్టర్‌ వద్ద రిపోర్ట్‌ తీసుకుంటాం. అదే విధంగా ఎస్‌ఐ కేసు వివరాలు మాకు ఇస్తే కలెక్టర్‌కు పూర్తి నివేదిక పంపుతాం. ప్రజలు వడదెబ్బ పరిహారం గురించి అవగాహన కల్గి ఉండాలి. తెలియని వారికి తెలియజేయాలి.

– బి కృష్ణ, తహసీల్దార్‌

వ్యక్తి దారుణ హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కంగ్టి(నారాయణఖేడ్‌): వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన కంగ్టి మండలం చాప్టా(కే) శివారులో చోటు చేసుకుంది. కంగ్టి సీఐ చంద్రశేఖర్‌ రెడ్డి కథనం మేరకు.. మండలంలోని ముర్కుంజాల్‌ గ్రామానికి చెందిన వడ్డె సంజు(42) కుల వృత్తి వడ్డెర పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో ఇతడి భార్య మూడు నెలల నుంచి పుట్టినిల్లు కర్ణాటకలో ఉంటుంది. సోమవారం సాయంత్రం చాప్టా(కే) శివారులో గుర్తు తెలియని దుండగులు సంజు గొంతు కోసి, ముఖంపై బండ రాళ్లతో కొట్టి చంపారు. గొర్రెలు మేపుతున్న వ్యక్తులు అటుగా వెళ్తూ మృతదేహాన్ని చూసి పోలీసులు సమాచారం ఇచ్చారు. సీఐ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని కూడవెల్లి చెక్‌ డ్యాం వద్ద చోటు చేసుకుంది. సోమవారం భూంపల్లి ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన కథనం మేరకు.. మెదక్‌ జిల్లా నిజాంపేట మండలం తిప్పనగుల్ల గ్రామానికి చెందిన నాయిని రాములు (63) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అక్బర్‌పేట కూడవెల్లి వాగు చెక్‌ డ్యాం వద్ద చేపలు పట్టడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. వాగులో చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబీకులకు, గజఈతగాళ్లకు సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్లు రెండు గంటల పాటు శ్రమించి రాములు మృత దేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డివాము దగ్ధం

పరుగులు తీసిన కాలనీ వాసులు


మంటలార్పుతున్న స్థానికులు

శివ్వంపేట(నర్సాపూర్‌): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైన ఘటన మండల పరిధి ఉసిరికపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు బాలయ్య పశువుల కోసం వరిగడ్డి వాము ఏర్పాటు చేశాడు. అర్ధరాత్రి గడ్డివాముకు నిప్పంటుకొని దట్టమైన పొగతో మంటలు చెలరేగాయి. నివాసగృహాలు దగ్గరగా ఉండడంతో కాలనీ వాసులు ఆందోళన చెంది బయటకు పరుగులు తీశారు. సమీప గృహాలకు నిప్పంటుకోకుండా స్థానికులు గ్రామ పంచాయతీ ట్యాంకర్‌ తో మంటలార్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


విఠల్‌ (ఫైల్‌)

శివ్వంపేట(నర్సాపూర్‌): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధి లింగోజిగూడ తండాలో సోమవారం చోటు చేసుకుంది. తండా వాసులు, పోలీసుల కథనం మేరకు.. తండాకు చెందిన మాలోత్‌ విఠల్‌ (54) వ్యవసాయ సాగు, కుటుంబ పోషణ నిమిత్తం అప్పులు కావడంతో వారం రోజుల నుంచి తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఆదివారం రాత్రి పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లిచూడగా గుడిసెలో ఉరి వేసుకొని కనిపించాడు. ఆర్థిక ఇబ్బందులతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- మద్యానికి బానిసై ఆత్మహత్యాయత్నం

పటాన్‌చెరు టౌన్‌: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ కథనం ప్రకారం.. మెదక్‌ జిల్లా అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లికి చెందిన కుమ్మరి శ్రీశైలం(41) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు పట్టణం గోకుల్‌నగర్‌లో ఉంటూ కూలి పని చేసుకుంటున్నాడు. మద్యానికి బానిసైన శ్రీశైలం వారం రోజులుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 27న పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తూ ఇంటి వద్దే ఉన్నాడు. ఇలా తాగితే ఇల్లు ఎలా గడుస్తుందని భార్య ఈశ్వరమ్మ భర్తతో గొడవ పడింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీశైలం అదే రోజు రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


మశ్చేందర్‌ రావు (ఫైల్‌)

పటాన్‌చెరుటౌన్‌: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చార్మినార్‌కు చెందిన మశ్చేందర్‌ రావు (51) వాచ్‌మెన్‌ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం నారాయణఖేడ్‌లో స్నేహితుడి కూతురి వివాహానికి వెళ్లి తిరిగి హైదరాబాద్‌ వైపు బైక్‌ పై వస్తున్నాడు. రాత్రి సమయంలో పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌ గురుకుల పాఠశాల సమీపంలోకి రాగానే మశ్చేందర్‌రావు బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం మృతుడి కుమారుడు గణేశ్‌ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గేదెలను కడిగేందుకు వెళ్లి..

ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి

హత్నూర(సంగారెడ్డి): గేదెలను చెరువులోని నీటిలో కడుగుతూ పశువుల కాపరి మృతి చెందిన ఘటన హత్నూర గ్రామ శివారులోని సాకిచెరువులో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు.. హత్నూర మండలం నవాబుపేట గ్రామానికి చెందిన కంకరి శ్రీను(36) ఆదివారం ఉదయం హత్నూర గ్రామానికి చెందిన వారి గేదెలను మేపేందుకు బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం హత్నూర నవాబుపేట గ్రామాల మధ్యలో ఉన్న సాకి చెరువులోని నీటి గుంతలో శ్రీను శవమై తేలి కనిపించాడు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. చెరువులో గేదెలను కడుగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సుభాష్‌ పరిశీలించి, మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

బైక్‌ అదుపు తప్పి..

ఒకరు మృతి, మరొకరికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): బైక్‌ అదుపుతప్పి పడిపోవడంతో ఒకరు మృతి చెంది, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అల్లీపూర్‌ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణానికి చెందిన ఏర్వ నాంపల్లి (37), అతడి మిత్రుడు నరేశ్‌ ఆదివారం ఉదయం బైక్‌పై మండల పరిధిలోని కిష్టాపూర్‌కు చేపల బేరానికి వెళ్లాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో అల్లీపూర్‌ శివారులో బైక్‌ అదుపు తప్పి పడిపోయారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. నాంపల్లి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.